మా మోటార్ కారు కాళీ బంగా దగ్గర పట్టాలు దాటుతున్నప్పుడు, 'ఇదంతా ఒకప్పుడు థార్ ఎడారి. ఇప్పుడు చూడండి—ఈ రాజస్థాన్ కాలువ రావడంతో—సస్యశ్యామలమైంది. సంవత్సరానికి రెండు పంటలు కూడా—అటు పత్తి, ఇటు గోధుమా. ఇది ఎడారి ప్రాంతం అని గుర్తు చేస్తున్నట్లుగా నడుమ అడపాదడపా ఒంటెలు ఎదురవుతున్నయ్'' అని అన్నారు బవేజా.

అలా వెళ్ళివెళ్ళి కాళీబంగా గ్రామం చేరుకున్నాం. ''ఇదుగో ఇదే శిధిలాలుండే చోటు. మొహెంజదారో కన్నా ప్రాచీన స్థలం ఇది'' అని నాతో చెప్పార

వెళ్ళే రైలు ఎక్కాలని. అప్పుడే వేసవి కాలం ప్రారంభమవుతున్నది. ఎండ చిటపటలాడుతున్నది.


''ఇక్కడికి పాకిస్తాన్ బార్డర్ ఎంత దూరం?'' ఉబుసుపోకకు అడిగాను.

''ఎంతా [illegible] మైళ్ళుంటుందేమో! చూస్తారా?'' సర్దార్జీయే అన్నాడు.

''మన రైలు మిస్సవుతామేమో'' అన్నాను సంశయంగా.

''అబ్బే! ఫర్వాలేదు. గంగానగర్‌లో సాయంత్రం ఎక్కించి వేద్దాం! బార్డర్ చూసుకుని హిందూమల్‌కోట్‌లో రైలెక్కొచ్చు'' అన్నాడు బవేజా.

నా సహచరులు కూడా సరే ననటంతో ఎన్నాళ్ళ గానో బార్డరు చూడాలనే నా కోరిక ఫలం పుచ్చుకుంది.



# జననీ జన్మభూమిశ్చ

## చంద్రమౌళి

గుర్నామ్‌సింగ్ తప్పుదుతడకల ఇంగ్లీషులో చెబుతున్నాడు. కారులో నుంచి దిగి అందరికన్నా ముందుగా నడవడం మొదలు పెట్టాను నేను. 'ఇదిగో ఇది ఆనాటి నగరవీధి. ఇది మంచినీళ్ళ బావి. ఈ ఇటుకలు చూడండి—ఎంత గట్టిగా ఉన్నయ్యో, ఇంత ఎత్తు నుంచి కింద పడేసినా విరగవు. ఇలా రండి. ఇది ఏనుగు అస్థిపంజరం.'' ఎన్ని శతాబ్దాలనాటిదో ఆ అస్థిపంజరం అలాగే కనిపిస్తున్నది. పైగా ఆనాటి ఏనుగులు ఇప్పుడు ఏనుగుల కన్నా సైజులో పెద్దవిల్లే ఉంది.

''ఇది ఆనాటి శ్మశానం!'' గైడు చెప్పుకు పోతున్నాడు.

వర్తమాన కాలంలో నుంచి గతంలోకి వెళ్ళినట్లనిపించింది. అంతుపట్టని మనసుల్లో నిండి ఉన్న ఆ ఫీసు తాలూకు విషయాలు వెనక్కుపోయాయి. అనంతమైన చరిత్ర ఒక గైడు రూపంలో నా ముందు నిల్చున్నట్లనిపించింది

కాళీబంగా నుంచి తిరిగివచ్చి భోజనం చేసుకుని గంగానగర్ బయలుదేరాం. అక్కడ ఢిల్లీ

జాతీయ విహంగాలు నెమళ్ళు అందంగా పురి విప్పి నాట్యం చేస్తుంటే తన్మయత్వంలో చూస్తూ సంధ్యాసంధ్య రంగులు మారుతున్న ఆకాశం వంక చూస్తుండగా ప్రయాణం సాగించాము.

హఠాత్తుగా ఎగజిమ్మినట్లు మా కారు ఒక ప్లాట్‌ఫారం మీదకు వచ్చి ఆగింది. అప్పుడుగాని అది పాడుబడిన రైల్వే స్టేషనని నాకు తెలియదు. వింతగా చూస్తుంటే—పట్టాలు లేని రైల్వేలైను, బుకింగ్ ఆఫీసులేని రైల్వే స్టేషనూ కనిపించాయి. ఒక మళయాళీ కుటుంబం సాయంత్రం కావటంతో బయటకు వాహ్యాళికి పోతున్నారు.

''ఇదే హిందూమల్‌కోట! దేశ విభజన జరుగక ముందు—ఈ స్టేషను గుండా రైళ్ళు నడిచేవి'' అని చెప్పుకుపోతున్నాడు బవేజా. దూరాన ఎత్తైన టవరు కనిపిస్తున్నది. ఒక సిపాయి మావైపు తుపాకి గురిపెట్టి చూడటంతో నా ఒళ్ళు జలదరించింది. ''అబ్బే! అది ఉట్టి బొమ్మే నండీ!'' అని నవ్వాడు బవేజా. అక్కడే ఉన్న బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ జవానుతో ''ఇలా ఢిల్లీ నుంచి వచ్చారు వీరు—బార్డరు చూస్తారు'' అని బవేజా అంటంతో అతను తన అధికారిని పిలుచుకు వచ్చాడు. అతను పర్మిషన్ ఇవ్వటంతో ఆ జవాను తన వెంట రమ్మన్నాడు మమ్మల్ని.

మన బోర్డరులో ఉన్న బంకరు దాటుతున్నప్పుడు నాలో ఏదో విచిత్రమైన భావన కలగసాగింది.

"ఇదుగో. ఇది మన కార్ట్ ట్రాక్ (బళ్ళదారి). అది వాళ్ళది. ఈ ట్రయాంగిల్‌లో సెక్టర్ కమాండర్ల సమావేశాలు జరుగుతాయి. ఇది నో మాన్స్ లాండ్" అని చెప్పుకు పోతున్నాడు మరియాలీ, బి. ఎస్. ఎఫ్. జవాను.

రెండడుగులు ముందుకు వేసి—"మన మిప్పుడు పాకిస్తాన్ లో ఉన్నాం" అన్నాడు బవేజా.

"వాళ్ళ సైనికు లెక్కడా కనపడరేం?" అన్నాను.

"అదుగో ఆ టవరుంది చూడండి—అక్కడుంటారు వాళ్ళు."

"మనం వాళ్ళ టెరిటరీలోకి వచ్చామే. వాళ్ళేమీ అనరా?"

"అబ్బే. వాళ్ళతో పరిచయం చేయమంటారా?" అన్నాడు బి. ఎస్. ఎఫ్. జవాను.

నేను వాచీ వంక చూసుకుని,

"చాలా టైమయి పోయింది. ఇంకోసారి ఎప్పుడైనా వచ్చినప్పుడు కలుసుకుంటాం" అన్నాను.

అక్కడ చెదురు మదురుగా పడున్న ఆకుపచ్చని రాళ్ళను పోగు చేసుకుంటూ పశ్చిమం వైపు చూస్తూ బవేజా తనలో తను లీనమై పోయాడు.

తూర్పున హిందుస్తాన్‌లో ఉదయించిన సూర్యుడు సాయంకాలం కావటంతో పాకిస్తాన్‌లో అస్తమిస్తూ ఈ రెండు దేశాలకూ ఉన్న అవినాభావ సంబంధం గుర్తు చేస్తున్నాడు.

విదేశీ ప్రయాణం చేశానన్న తృప్తితో వచ్చి కారెక్కాను. ఇంతసేపటిదాకా ఎన్నో మాటలు చెబుతున్న బవేజా ఒక్కసారి ఏదో ఆలోచనలో పడటంతో—

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాను.

బవేజా ఒక క్షణం తటపటాయించి, "ముప్పై ఏళ్ళ నాటి సంగతులు జ్ఞాపకం వచ్చాయి అంతే" అన్నాడు.

నేను ఉత్సుకతతో ఆయన వంక చూస్తూ ఉండి పోయాను.

"ముప్పై ఏళ్ళ నాడు ఈ హిందూమల్‌కోట స్టేషనులోనే నేను, నా కుటుంబం వేలాది ఇతరులతో, కట్టుబట్టలతో దిగాం. అదుగో స్టేషను కెదురుగా ఆ మర్రిచెట్టు ఉంది చూశారా ఆ మర్రిచెట్టు కిందే మేము పడుకున్నాం. అప్పటికి ఏదైనా తిని మూడు రోజులైంది. నాలుగు రోజుల క్రితం ఒక బ్రిటిష్ ఆఫీసరు దయతలంచి ఇచ్చిన బ్రెడ్ ముక్కలు పంచుకు తిన్నాం". నేను మంత్ర ముగ్ధుడిలా ఆయన వంక చూస్తూ ఉండి పోయాను. "పాకిస్తాన్ నుంచి ఏ విధంగా ఈ హిందూమల్‌కోట వచ్చేమో చెప్పలేను. కాలినడకన, రైలు పై కప్పు మీద కూర్చుని . . . అసలు ఈ హిందూమల్‌కోట చేరగలనా అన్న అనుమానం అడుగడుగునా నన్ను మళ్ళీ వెంటాడుతుండేది. ఆఖరికి ఈ 'హిందూమల్‌కోట' అన్న బోర్డు చూశాక పోయిన ప్రాణాలు తిరిగి వచ్చేనట్లనిపించింది. అదుగో అక్కడ ఆ వేపచెట్టుంది చూడండి. ఆ చెట్టు కింద సంఘ సేవకులు మాకందరికీ తలా ఒక ఎండిపోయిన రొట్టె ఇచ్చారు. ఆ నాడు ఆ రొట్టె నా ప్రాణాని కొక అమృత ఖండంగా ఉందంటే నమ్మండి. అంత ఆకలి లోనూ ఆ రొట్టె ఎక్కడ అయిపోతుందోనని గంట సేపు తిన్నాను నేను.

"భగల్ పూర్‌లో నేను ప్రాక్టీసు చేస్తుండే వాడిని. రెండు చేతులా సంపాదిస్తూ సైలాపచ్చీసుగా బ్రతికాను. అవన్నీ పోయినై. ఆ ఎండు రొట్టె తింటుంటే. ." అది చెబుతుంటే బవేజా కళ్ళల్లో నీళ్ళు. తిరిగినట్లనిపించింది.

పాత రైల్వే స్టేషనుకు తూర్పుకు కొత్తగా కట్టిన స్టేషను దగ్గరకు వచ్చి ఆగింది మా కారు. ఇంకా రైలు వచ్చే టైము కాలేదు. బడ్డీహోటలొకటుంటే దాని ముందున్న బెంచీ మీద కూర్చున్నాం. బవేజా కథ వింటూంటే ఎవరో ఆత్మీయుడి కథ వింటున్నట్లుంది.

"తరువాత?" ఉత్సాహంతో అన్నాను.

"పొట్ట కూటికి నేను చేయనిది లేదు. సర్టిఫికెట్లు వెంట లేకపోవటంవల్ల, నేను బి. ఎల్. చదివాననీ, గోల్డ్‌మెడలిస్టుననీ చెప్పినా ఎవ్వరూ నమ్మలేదు. రిఫ్యూజీలకు పిటిషన్‌లు రాసి పెట్టి పావలా రాబడి సంపాదించటం నుంచీ, కూరగాయలు అమ్మటం దాకా చేశాను. ఇక ఇది గాదని గంపెడాశతో ఢిల్లీ బయలు దేరాను. అప్పటి రైళ్ళను రైళ్ళనటం కన్న బ్లాక్ హోల్స్ అనటం మేలు. నాకు రైల్లో చోటు దొరక్క, రైలు కప్పు మీద ప్రయాణం చేశాను. ఒక రోజల్లా ఉపవాసం ఉండి, ఢిల్లీ చేరాను. అప్పటి ఢిల్లీని తలుచుకుంటే ఎంతో వింత వేస్తుంది. ఎక్కడబట్టినా చీమల్లాగా మనుషులు—కాందిశీకులు లేని రోడ్డు లేదు. నాకు ఒకచోట చోటు దొరికింది. ఏదో ఉద్యోగం సంపాదించడానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనై. జ్వరపడి, ఒక సత్రపు వరండాలో పడున్న తరవాత తిరిగి రాజస్థాన్‌లో నా పిల్లల దగ్గరకు చేరుకున్నాను. అక్కడే కోర్టులో చిన్న ఉద్యోగం దొరికింది. ఒక విధంగా స్థిరపడ్డాను."

ఎవరో సర్దార్జీ గుర్రం ఎక్కి ప్లాట్‌ఫారం మీదుగా వెళుతున్నాడు. టీ బడ్డీ అసామీ టీ కలిపి తెచ్చాడు. అంతమటుకూ బవేజా చెబుతున్నది వింటున్నాడల్లే ఉంది ఆ టీ దుకాణం ఆసామీ—"మీది భవాల్ పూరా సార్" అన్నాడు. బవేజా సమాధానం చెప్పేలోపల గుర్నాంసింగ్ రైలు కూత వినిపిస్తున్నదన్నాడు.

"భవాల్ పూర్‌లో ఏ పేటలో ఉండేవాళ్ళు?" మళ్ళీ అడుగుతున్నాడు టీస్టాలు అతను.

బవేజా అతనివంక ఒకసారి చూచి,

"అరే నువ్వు వేద్‌ప్రకాశ్‌వి కదూ?" అన్నాడు.

"నువు ప్రకాశచంద్‌వా? అయ్యో ఎన్ని సంవత్సరాలయింది భాయి మనం కలుసుకుని" అని కౌగలించుకున్నాడు.

"ఇదిగో వీరిని రైలెక్కించి వస్తానుండు" అంటూ బవేజా మా వంకకు వచ్చాడు. అతని చేతిలో ఆకుపచ్చని రాళ్ళు అలాగే ఉన్నై. వాటి వంక చూస్తున్న నన్ను చూసి, బార్డరు వంక చూస్తూ—"ఆ నేలకూ, ఈ నేలకూ తేడా ఏమిటి చెప్పండి రావుగారూ! అక్కడ నేను పుట్టాను, ఇక్కడ జీవిస్తున్నాను" అన్నాడు. *

